



పాశర్లపూడి సత్రం తోటలో మోకాలు లోతు నీటిలో వస్తున్న మహిళ



రాయవరం మండలం లొల్ల గ్రామంలో వర్షాలకు చెరువులను తలపిస్తున్న పంట పొలాలు





వర్షాలకు అంబాజీపేటలో ముంపునీటిలో ఉన్న వరిపొలాలు.. రావులపాలెం మండలం ఈతకోటలో నాట్లు వేసిన వరి చేలు ముంపు నీటిలో మునిగిపోయిన దృశ్యం

ముసురు.. ముంపు!

- స్తంభించిన జనజీవనం
- అటు వదలని భారీ వర్షాలు
- ఇటు గోదావరికి వరద పోటు
- నేడు పాఠశాలలకు సెలవు
- చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం
- తొమ్మిది మండలాలకు ప్రత్యేక అధికారులు
- జిల్లావ్యాప్తంగా నీట మునిగిన నారుమడులు, పంట పొలాలు
- పొంగుతున్న డ్రెయిన్లు
- వరి నారు, వరి నాట్లు మునకతో రైతులు గగ్గోలు

అమలాపురం, జూలై19 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, గోదావరి వరదలతో కోనసీమ జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు. శుక్రవారం రాత్రికి ఎన్డీఆర్ఎఫ్ బృందం జిల్లాకు చేరుకున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. భారీ వర్ష సూచన కారణంగా కోనసీమ జిల్లాలోని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలలకు శనివారం సెలవు ప్రకటించారు. ముందు జాగ్రత్తగా తొమ్మిది మండలాలకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ప్రధానమైన ముక్తేశ్వరం, కోటిపల్లి, సఖినేటిపల్లి, నర్సాపురం రేవులతోపాటు పలు రేవుల్లో పంటు, పడవ ప్రయాణాలను నిలుపుదల చేశారు. గత రెండ్రోజుల నుంచి భారీ వర్షాలతో జిల్లాలోని వేల ఎకరాల్లో వరి పొలాలు పూర్తిగా నీటమునిగాయి. డ్రెయిన్లు, పంటకాల్వల పొంగి ప్రవహించడంతో ముంపునీరు దిగే మార్గం లేకపోవడంతో పొలాల్లోకి నీరు చేరి నారుమడులు, వేసిన నాట్లు మునగడంతో రైతులకు నష్టం వాటిల్లింది. రాగల 24 గంటల్లో భారీ వర్ష సూచన నమోదయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా జిల్లాలో అప్రమత్తతో ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ధవళేశ్వరం వద్ద 2.80 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 45 ఆవాస ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, ప్రస్తుతం మూడు లంక గ్రామాలు ముంపు బారినపడినట్టు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ముంపుబారిన పడ్డ బాధితులను సురక్షిత ప్రాంతాలకు తీసుకువచ్చేందుకు గత ఈతగాళ్ల, ప్రత్యేక బోట్‌లు, లైఫ్ జాకెట్లను సిద్ధం చేసినట్టు తెలిపారు. గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల వెంబడి ఏటిగట్లకు గండ్లు పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. వర్షాలు, వరదలు సమాంతరంగా రావడం వల్ల ముంపు తీవ్రత పెరగవచ్చనే అంచనాతో జిల్లా యంత్రాగాన్ని అప్రమత్తం చేశామన్నారు. ఫెర్రీ పాయింట్ల వద్ద లైఫ్ జాకెట్ల సహాయంతో బోట్లను సిద్ధం చేసినట్టు తెలిపారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ల ద్వారా వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. సముద్ర తీర ప్రాంతాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. మొగల వద్ద తవ్వకాలు కూడా చేపట్టి ముంపు నీరు సముద్రంలో దిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

అత్యధికంగా ఆత్రేయపురంలో వర్షపాతం

శుక్రవారం ఉదయం నుంచి రాత్రి 6.30 గంటల దాకా జిల్లాలో సగటున 14.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం 323.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఆత్రేయపురంలో 32.4, కాట్రేనికోనలో అత్యల్పంగా 3.8 మి.మీ నమోదుకాగా.. మండపేట 22, రాయవరం 17.8, రామచంద్రపురం 8.8, ఆలమూరు 23.2, రావులపాలెం16.8, కొత్తపేట 21.2, కపిలేశ్వరపురం 25.2, కె.గంగవరం 9.8, ఐ.పోలవరం4.2, ముమ్మిడివరం 5.8, అయినవిల్లి 9.6, పి.గన్నవరం 15, అంబాజీపేట 19.2, మామిడికుదురు13.4, రాజోలు15.6, మలికిపురం 20.8, సఖినేటిపల్లి 12.8, అల్లవరం12.2, అమలాపురం 9.2, ఉప్పలగుప్తంలో 4.4మి.మీ.



జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

9 మండలాలకు ప్రత్యేక అధికారులు

వరదలు, వర్షాల కారణంగా ముంపు బారినపడి తొమ్మిది మండలాలకు వరద ముంపు సహాయక చర్యల నిమిత్తం ప్రత్యేకాధికారులను నియమించారు. పి.గన్నవరం మండలానికి కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, అయినవిల్లి మండలానికి డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, మామిడికుదురు మండలానికి అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, ముమ్మిడివరం మండలానికి డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఐ.పోలవరం మండలానికిజిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ప్రసాద్, మలికిపురం మండలానికి జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, కాట్రేనికోన మండలానికి డీఎల్పీవో పి.బొజ్జిరాజు, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాలకు రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్‌ను నియమించారు.





పి.గన్నవరం మండలం గంటిపెదపూడి శివారు బూరుగులంకలో ఇంజన్ బోటుపై నదీపాయను దాటుతున్న లంక గ్రామస్తులు.. ఇదేచోట లైఫ్‌జాకెట్ వేసుకుని పడవపై పర్యటిస్తున్న ఆర్డీవో

వానలో.. వరద పోటులో పడవ ప్రయాణం

పి.గన్నవరం, జూలై19: గాలి వానలో.. వరద నీటిలో పడవ ప్రయాణం సాగిస్తున్నారు లంకగ్రామాల జనం. ఎడతెరపులేని వర్షంతో పడవలపై రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు భారీ వర్షాలతో ఎగువన గోదావరికి వరద పోటెత్తడం, దిగువన సముద్రంలోకి కొంతమేర నీరును వదలడంతో నదీపాయల్లో వరద ప్రవాహం పెరుగుతోంది. దాంతో లంకల్లోకి నీరు చేరుతోంది. ఫలితంగా పి.గన్నవరం మండల పరిధిలోని గంటిపెదపూడి శివారు బూరుగులంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఊడిమూడి శివారు ఊడిమూడిలంక గ్రామస్తులు ఇంజన్ పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. జోరువానలో పడవలపై రాకపోకలు సాగించడానికి రైతులు, విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నిత్యావసర వస్తువుల కోసం ఇవతలి ఒడ్డుకు వచ్చే లంకగ్రామాల ప్రజానీకం అవస్థలు పడుతున్నారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని గ్రామాలైన పెదమల్లంక, అనగార్లంక, పుచ్చల్లంక, అయోధ్యలంక గ్రామస్తులు సైతం నాటుపడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

లైఫ్‌జాకెట్ లేకపోతే పడవ దాటించొద్దు..

పి.గన్నవవరం, జూలై 19: గంటిపెదపూడి శివారు బూరుగులంక నదీపాయ వద్ద లైఫ్‌జాకెట్ లేకపోతే అవతలి ఒడ్డుకు పంపించొద్దని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ స్థానిక సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. గంటిపెదపూడి, ఊడిమూడి శివారు లంక గ్రామాల ప్రజలు రాకపోకల నిమిత్తం నదీపాయలో ఏర్పాటుచేసుకున్న తాత్కాలిక రహదారి వరదలో కొట్టుకుపోవడంతో శుక్రవారం నదీపాయను ఆర్డీవో పరిశీలించి అనంతరం మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లంకగ్రామస్తుల రాకపోకల నిమిత్తం ఇంజన్‌బోట్లు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. పడవల్లో పూర్తిస్థాయిలో లైఫ్‌జాకెట్లు ఏర్పాటు చేశామన్నారు. నదీపాయ వద్ద రెవెన్యూ సిబ్బందితోపాటు పోలీసు, మత్స్యశాఖ, పంచాయతీరాజ్ సిబ్బంది ఇరవై నాలుగు గంటలు లంక గ్రామస్తులకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. నదీపాయ అవతలి ఒడ్డున సుమారు 2వేల జనాభాతో నాలుగు గ్రామాలు ఉన్నాయని, అత్యవసరమైతేనే ఇవతలి ఒడ్డుకు రావాలని వారికి సూచిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ నాలుగు గ్రామాల్లోని విద్యార్థులకు కలెక్టర్ ఆదేశాలతో సెలవులు ప్రకటించడం జరిగిందని, తల్లిదండ్రులు తమ పిల్లలను బోట్లపై ఇవతలి ఒడ్డుకు తీసుకురావద్దని హెచ్చరించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ ఎస్‌కె హలాస్సేన్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ఆర్ఐ పి.నరసింహరావు, వీఆర్వో భగవాన్, పోలీసు, మత్స్యశాఖ సిబ్బంది ఉన్నారు.





పూడుకుపోయిన రంగరాజుకోడులో కలుస్తున్న బ్రాంచి డ్రెయిన్.. పూడుకు పోయిన డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లిఖార్జునరావు

ఇటు రెయిను.. అటు డ్రెయిను

మాకు సంబంధం లేదంటూ డ్రెయిన్స్, రెవెన్యూ శాఖల వాదన

పూడికతో మూసుకుపోయిన బ్రాంచి డ్రెయిన్.. లబోదిబోమంటున్నరైతులు

ఉప్పలగుప్తం, జూలై 19: సిరిపల్లి-మునిపల్లి ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకుని రంగరాజుకోడు మీడియం డ్రెయిన్‌లో కలిసే సన్నవిల్లి బ్రాంచి డ్రెయిన్‌లో పూడిక తీయాలంటూ చాలాకాలంగా రైతులు అభ్యర్థిస్తున్నారు. సన్నవిల్లి రైతుల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నాట్లు వేసిన పొలాలు, సార్వా నారుమళ్లు ముంపు బారినపడ్డాయి. మురుగు దిగేందుకు డ్రెయిన్ సహకరించక రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం వ్యవసాయాధికారి పొలాలను పరిశీలించారు. తక్షణం ముంపునీరు బయటకుపోకుంటే నాట్లు దెబ్బతింటాయన్నారు. అయితే డ్రెయిన్స్ అధికారులు ఆ డ్రెయిన్ తమ పరిధిలోకి రాదంటూ చావుకబురు చల్లగా చెప్పి వెళ్లిపోయారు. శుక్రవారం పొలాల పరిశీలనకు వచ్చిన తహసీల్దార్ మల్లిఖార్జునరావు డ్రెయిన్‌ను పరిశీలించి తమకు సంబంధం లేదని తేల్చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ అధికారులను అడిగితే ఉపాధి కూలీలు డ్రెయిన్‌లో దిగేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్టు సమాధానమిచ్చారు. ఇప్పుడు ఆ డ్రెయిన్‌లో యుద్ధప్రాతిపదికన పూడిక తీయకపోతే వందలాది ఎకరాలకు నష్టం తప్పదు. డ్రెయినేజీ, రెవెన్యూ శాఖలు తమకు సంబంధం లేదని చెప్పడంతో రైతులు అయోమయంలో పడ్డారు. సొంతంగా పూడిక తీసుకుందామంటే లక్ష రూపాయల వరకు ఖర్చవుతుంది. డ్రెయిన్‌లో పూడిక తీసి ముంపు దిగేందుకు తక్షణం మార్గం ఏర్పాటుచేయకపోతే ఆందోళనకు దిగుతామని రైతులు హెచ్చరిస్తున్నారు.



ముమ్మిడివరం మండలం అయినాపురంలో నీట మునిగిన వరి పొలాలు



ఎంపీ హరీష్ ఇంటి వద్ద ఆత్మీయ సమావేశానికి హాజరైన మంత్రి, ఎమ్మెల్యేలు

కోనసీమ అభివృద్ధికి సంఘటితంగా పనిచేద్దాం

ఎంపీ ఇంట్లో భేటీ... మంత్రి సుభాష్, కూటమి ఎమ్మెల్యేలు హాజరు

అమలాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అభివృద్ధికి టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలంతా సంఘటితంగా పనిచేయాలని నిర్ణయించారు. అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అమలాపురంలోని పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్ బాలయోగి నివాస గృహంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు (అమలాపురం), బండారు సత్యానందరావు (కొత్తపేట), వేగుళ్ల జోగేశ్వరరావు (మండపేట), దాట్ల సుబ్బరాజు (ముమ్మిడివరం), గిడ్డి సత్యనారాయణ (పి.గన్నవరం), దేవ వరప్రసాద్ (రాజోలు) ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీ హరీష్‌మాధుర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ భేటీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన పనులపై ఎంపీ, ఎమ్మెల్యేలు సుదీర్ఘంగా చర్చించుకున్నారు. కొన్ని పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. కీలక అంశాలపై జరిగిన తొలి భేటీ సంతృప్తికరంగా జరిగిందని వారు ప్రకటించారు. ఎమ్మెల్యేలతో పాటు పార్టీ అనుచర గణాలు ఎంపీ ఇంటి వద్దకు చేరడంతో కోలాహలంగా ఉంది.

భవన నిర్మాణ కార్మికులకు పథకాల పునరుద్ధరణ

కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ.. ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యేలకు ఘన సత్కారం



మహిపాలచెరువులో మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, ఎమ్మెల్యే దాట్లకు సత్కారం

ముమ్మిడివరం, జూలై 19: రాష్ట్రంలో గత వైసీపీ పాలనలో నిలిపివేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అన్నిటినీ పునరుద్ధరిస్తామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ముమ్మిడివరం మండలం మహిపాల చెరువు గ్రాండ్‌పార్కు కన్వెన్షన్ హాలులో శుక్రవారం గుద్దటి జమి అధ్యక్షతన జరిగిన సన్మాన విజయోత్సవ అభినందన సభలో కార్మికశాఖ మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణరంగంలో ఉన్న 30 లక్షల మంది కార్మికులు వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. వారంతా వైసీపీకి తగిన గుణపాఠం చెప్పి ఎన్డీఏ కూటమికి మద్దతుగా నిలిచారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి, అభివృద్ధికి గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలుచేసిన సంక్షేమ పథకాలు అన్నిటినీ పునరుద్ధరించి పూర్తిస్థాయిలో ఆయా వర్గాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎన్నికలకు ముందు అమలాపురం విచ్చేసిన సందర్భంలో కులాల కలయిక జరగాలని సూచించారన్నారు. ఇద్దరి వ్యక్తుల మధ్య గొడవలను వైసీపీ ప్రభుత్వం కులాల మధ్య గొడవలుగా చూపిస్తూ వేధింపులకు గురిచేశారన్నారు. కాపు నాయకుడైన గంధం పల్లంరాజు, మరో 16 మంది కాపు యువకులపై పీడీ యాక్టు ప్రయోగించేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. పల్లంరాజును వైసీపీలోకి తీసుకువచ్చేందుకు అతనిపై ఎన్నో ఒత్తిళ్లు తీసుకువచ్చారన్నారు. మరో ముఖ్య అతిథి, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని ఐదేళ్లలో పూర్తి చేస్తామన్నారు. తాము ఇచ్చిన హామీలన్నింటికీ కట్టుబడి ఉంటామన్నారు. ఓఎన్జీసీ సీఎస్సార్ నిధులు ఏడు నియోజకవర్గాల్లో సమంగా అందించేందుకు కృషిచేస్తానన్నారు. రైలు కూతను త్వరలోనే కోనసీమ ప్రజలకు వినిపిస్తామన్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అవగాహనా రాహిత్యంతో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్‌తోపాటు అన్ని వ్యవస్థను సర్వనాశనం చేసిందన్నారు. దాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం వేదికపై మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే సుబ్బరాజులను పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. సన్మాన కార్యక్రమానికి హాజరైన త్సవటపల్లి నాగభూషణం, నంద్యాల చంటిలతోపాటు పలువురు విద్యార్థులకు ఉపయోగపడే నోటు పుస్తకాలను భారీఎత్తున సన్మాన గ్రహీతలకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చెల్లి వివేకానంద, మానేపల్లి అయ్యాజీవేమా, నాయకులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, గంధం పల్లంరాజు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, అర్థాని శ్రీనివాసరావు, గొలకోటి దొరబాబు, గోదశి పుండరీష్, దూడల స్వామి, అత్తిలి బాబూరావు, ముత్యాల జయలక్ష్మి, నాలుగు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలికి.. విసిరిన వలలో తనే చిక్కుకుని..

వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి

మామిడికుదురు మండలం కరవాక గ్రామంలోని గంగాపురం కాలనీకి చెందిన కొప్పనాతి రాంబాబు ఉప్పుటేరులో వేటకు వెళ్లాడు. పడవలోంచి విసిరిన వల గాలికి తిరిగి అతని మీదే పడిపోయింది. దాంతో వలలో చిక్కుకుని ఉప్పుటేరులో పడిపోయాడు. వచ్చే మార్గంలేక ప్రాణాలు కోల్పోయాడు. అతనిపై ఆధారపడిన కుటుంబం రోడ్డున పడింది. - 7లో



జేఎన్టీయూకే అభివృద్ధికి నావంతు కృషిచేస్తా

ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ మురళీకృష్ణ - 7లో

ఆక్వా రైతుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళతా : మంత్రి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై19: ఆక్వా రైతుల సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో నిర్వహించిన రామచంద్రపురం నియోజకవర్గ ఆక్వా రైతుల సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడారు. ఆక్వా రైతులు నియమనిబంధనలు పాటిస్తూ సాగుచేయాలని సూచించారు. పలువురు ఆక్వా రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు మంత్రి సుభాష్‌కు వివరించారు. వారి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టిలో పెడతానని ఆయన హామీ ఇచ్చారు. ఆక్వారైతులు సమస్యలు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల ఆక్వా రైతులు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.


ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్లనుంచి దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు


సీతానగరం మండలంలో నీటమునిగిన వరి పొలాలు


అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో పొంగిపొర్లుతున్న సోకిలేరువాగు జలపాతం

ఉద్ధృతంగా గోదావరి

- కాటన్ బ్యారేజ్ 175గేట్లు 1మీటరు మేర ఎత్తివేత
- 3.46 లక్ష క్యూసెక్కులు సముద్రంలోకి
- పొంగుతున్న వాగులు, వంకలు
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి వరద


కూనవరం మండలం వద్ద శబరి సీలేరు, గోదావరి నదుల సంగమ ఉధృతి

ధవళేశ్వరం, జూలై 19: గోదావరి పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా వరద ప్రవాహం గోదావరిలో కలుస్తుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో కాటన్ బ్యారేజ్ వద్ద శుక్రవారం ఉదయం 175 గేట్లను 70మిల్లీమీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు సాయంత్రానికి ఒక మీటరు పైకి ఎత్తి 3,46,391క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 7అడుగులుగా నమోదైంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు గోదావరికి చేరుతుండడంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం మరింత పెరిగి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో ప్రవహించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద 26అడుగుల వరకు వేగంగా పెరిగిన నీటి మట్టం ఆపై నెమ్మదించి శుక్రవారం సాయంత్రానికి 26.80అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం పెరుగుదల నెమ్మదించినా ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో 40 అడుగులకు పైగా నీటి మట్టం పెరగవచ్చని అధికారుల అంచనా.

ఏజెన్సీలో ఎడతెరిపి లేని వాన

- పరిస్థితిని సమీక్షిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి

చింతూరు, జూలై 19: అల్లూరి జిల్లా చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో శుక్రవారం రోజంతా ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలో శుక్రవారం రోజంతా వర్షం కురిసింది. దీంతో శబరి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు రాకపోకలకు ఎటువంటి అంతరాయాలు చోటుచేసుకోలేదు. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి 26.5 అడుగులకు చేరుకుంది. శనివారం నాటికి 30 అడుగుల నీటి మట్టానికి చేరుకోవచ్చన్న అంచనా ఉంది. ఎగువ రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా సరిహ ద్దులలో కూడా వర్షం కురుస్తుండడంతో ఆ నీరంతా శబరిలోకి చేరి ఉధృతికి కారణంగా మారింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా వ్యవ సాయ పనులు నిలిచిపోయాయి. చింతూరు, వరరామచంద్రపురం మండ లాల నడుమ ప్రధాన రహదారిపై జల్లివారిగూడెంవాగు పొంగి ప్రవహిస్తుండడంతో దాదాపు నాలుగు గంటలపాటు ఆ దిశగా రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రానికి వర్షం కాసింత తగ్గుముఖం పట్టడడంతో అటుగా రాకపోకలు పునరావృతమయ్యాయి. చింతూరు ఐటీడీఏ పీవో ఎప్పటికప్పుడు వరద ఉధృతిపై సమీక్ష చేస్తున్నారు. పొంగి ప్రవహిస్తున్న వాగుల వద్దకు ఆయన తన బృందంతో నేరుగా పరిశీలిస్తున్నారు. ఆ మేరకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇప్పటికి వరద సహాయ చర్యల్లో భాగంగా బఫర్ స్టాక్ సిద్ధం చేశారు.


చింతూరు-వరరామచంద్రపురం మండలాల నడుమ ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరుగూడెం వాగు

కోటిపల్లి ఫెర్రీ రేవులో రాకపోకలు బంద్

కె.గంగవరం, జూలై19: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి-ముక్తేశ్వరం ఫెర్రీ రేవులో రాకపోకలు శుక్రవారం ఉదయం నుంచి నిలిపివేశారు. బంగాళాఖాతం అల్పపీడనం కారణంగాను, ఎగువ ప్రాంతా ల నుంచి గోదావరికి వస్తున్న వరదనీటి కారణంగా గోదా వరిలో ప్రవాహం ఉధృతంగా ఉంది. ఫెర్రీ రేవులో తాత్కాలిక రహదారి మునిగిపోవడంతో రాకపోకలు నిలిపి వేశారు. వరద ఉధృతి తగ్గిన తరువాత రాకపోకలు పునరుద్ధరిస్తామని ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ చెప్పారు.


కోటిపల్లి ఫెర్రీలో నిలిచిపోయిన పంట్లు


అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలంలో నీటమునిగిన వరి పొలాలు


వరదనీటిలో ఉన్న పోశమ్మగండి అమ్మవారి ఆలయం

జలదిగ్బంధంలో గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం, జూలై 19: ఇటీవల కురిసిన వర్షాలకు గత వారంరోజుల నుంచి గోదావరి వరద నెమ్మనెమ్మదిగా పెరగడంతో మండలంలో ముంపు గ్రామాలతోపాటు మాతృశ్రీ గండి అమ్మవారి ఆలయాన్ని శుక్రవారం చుట్టుముట్టింది. దీంతో అమ్మవారి విగ్రహం మెడ భాగం వరకు వరదనీరు చేరింది. ఇదే వరద కొనసాగినట్లయితే శనివారం సాయంత్రానికి వరదనీరు అమ్మవారి గోపురాన్ని తాకే అవకాశముంది. ఎడతెరిపి లేకుం డా వర్షం కురవడంతో మండలంలో పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. మరోపక్క వర్షందాటికి నారుమడులు, పలు కూరగాయల పంటలు నీట మునిగాయి.

కోటసత్తెమ్మ ఆలయానికి తాకిన వరదనీరు


తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయంలోకి ప్రవేశించిన వరదనీరు

నిడదవోలు, జూలై 19 : నిడదవోలు మండలం తిమ్మ రాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలోకి వరదనీరు ప్రవేశించింది. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్రకాలువ వరదనీరు దిగువకు విడుదల చేయడంతో అమ్మవారి దేవస్థానం వెనుకఉన్న కల్వర్టు ద్వారా అమ్మ వారి గర్భాలయంలోకి ప్రవేశించింది. అలాగే ఆలయ ఆవ రణలోని ధ్వజస్తంభం ప్రాంతంలో కూడా వరదనీరు ప్రవే శించింది. ఆలయ అధికార్లు ఆలయం లోపల నీటిని మో టార్ల ద్వారా బయటకు తోడించేలా చర్యలు చేపట్టారు. ఎర్రకాలువ ఎప్పుడు పొంగి ప్రవహించినా అమ్మవారి ఆలయంలోకి ప్రవేశిస్తోందని, సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ, జూలై 19: ఈనెల 20వతేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం జరుగుతుందని జడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. జడ్పీ ఛైర్మన్‌తోపాటు ఆయా స్థాయి సంఘాల ఛైర్మన్ల అధ్యక్షతన స్థాయీసంఘాల సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ఆయా స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సీఈవో తెలిపారు.

22న కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడసిటీ, జూలై 19: ఈనెల 22న కాకినాడలోని వికాస కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో వివిధ కంపెనీలు, సంస్థల్లో లోన్ ఆఫీసర్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్, ట్రైనీ అకౌంటెంట్, అకౌంటెంట్, సర్వీస్ అడ్వయిజర్, హెల్పర్స్, టెక్నీషియన్, టెలికాలర్, సేల్స్ రిప్రజెంటేటివ్, అసిస్టెంట్ మేనేజర్, సూపర్‌వైజర్, కెమిస్ట్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.30వేలవరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం వసతి, రవాణా ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరుకావాలన్నారు. సెల్:7799376111లో సంప్రదించాలన్నారు.

నేడు రామచంద్రపురంలో మెగాజాబ్ మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 19: రామచంద్రపురం వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మెగాజాబ్‌మేళా నిర్వహించనున్నారు. జాబ్‌మేళాలో సాఫ్ట్‌వేర్, ఫార్మా, బ్యాంకింగ్, బి.పి.వో, టెక్నికల్ రంగానికి సంబంధించి 36 ప్రముఖ కంపెనీల్లో సుమారు 2366 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టరు కె. లచ్చారావు తెలిపారు. ఎన్‌క్లవడ్ సర్వీసెస్, జెన్‌ప్యాక్ట్, టెక్‌మహీంద్రా, ఎంఎస్‌ఎన్ ఐటీ, ఓషన్‌యాప్స్‌టెక్నాలజీస్, బి.ఎస్.సి.పి.ఎల్, నిట్, ఐసిఐసిఐ బ్యాంకు, కోజెంట్ ఇ సర్వీసెస్, ఇండిగో ఎయిర్ లైన్స్, హోండాయ్ మోబీస్, డెక్కన్ కెమికల్స్ తదితర సంస్థల్లో వివిధ ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తామన్నారు. ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు వయస్సుగల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఉద్యోగాలను బట్టి రూ 13 వేల నుంచి 60 వేలు వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఉదయం 9 గంటలకు అర్హత సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావాలని కోరారు.

జేఎన్టీయూకే అభివృద్ధికి కృషిచేస్తా

- ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జూలై 19: కాకినాడ జేఎన్టీయూకే అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించడంతోపాటు కాలానుగుణంగా ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న మార్పులను అనుసరించి బోధన ఉండేలా ప్రణాళిక చేపడతామన్నారు. వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా తనకు అవ కాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి సౌరబ్‌గౌర్, ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ రామ్మోహన్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణకు మాజీ ఉపకులపతులు, వర్సిటీ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాదరాజు, శ్రీనివాసకుమార్, పద్మరాజు, రిజిస్ట్రార్ సుమలత, మాజీ రిజిస్ట్రార్‌లతో ఇన్‌ఛార్జి వీసీ సమావేశం నిర్వహించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


మురళీకృష్ణను అభినందిస్తున్న ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్, మాజీ వీసీలు

గోకవరం పోలీసులు నన్ను హింసించారు

- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆరోపణ
- ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు వెల్లడి



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 : గోకవరం ఎస్ఐ తనపై దౌర్జన్యం చేసి దుర్భాషలాడారని గోకవరం మండలం మల్లవరం గ్రామానికి చెందిన ఇంటి సూర్యచంద్ర అనే వ్యక్తి ఆరోపించారు. ఈ మేరకు రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సూర్యచంద్ర శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన మల్లవరంలో తన పక్కింటివారితో తలెత్తిన వివాదంపై గోకవరం పోలీసులను ఆశ్రయిస్తే బాధితుడినైన తనపైనే దౌర్జన్యం చేశారని తెలిపాడు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ, డీఎస్పీలకు ఫిర్యాదు చేయడం జరిగిందని, తనకు న్యాయం చేయాలని కోరారు.

అగ్నివీర్‌లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

రంపచోడవరం, జూలై 19: అగ్నివీర్ పథకంలో భాగంగా భారత వాయుసేనలో ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైందని గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు జూలై-2004 నుంచి జనవరి -2008 మధ్య జన్మించి ఉండాలని, ఇంటర్ ఒకేషనల్, పాలిటెక్నిక్‌లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. ఈనెల 28 తేదీ లోగా http://agnipathvayu.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాల

మత్స్యకారులకు చిక్కిన పండుగొప్పలు

అంతర్వేది, జూలై 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెంలో మినీ ఫిషింగ్ హార్బర్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల వలలకు శుక్రవారం అధిక సంఖ్యలో పండుగొప్ప చేపలు దొరికాయి. సాగరసంగమం తీరాన మత్స్యకారులు వేటాడారు. ఎర్ర నీరుకు ఎదురీదుతున్న పండుగొప్ప చేపలు మత్స్యకారుల వలలకు చిక్కాయి. పల్లెపాలెంలో మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు వాటిని విక్రయించారు. కొనుగోలుదారులు పాట పాడుకున్నారని, రూ.లక్షల్లో ఆదాయం వచ్చిందని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. కిలో రూ.500 చొప్పున విక్రయించినట్టు చెప్పారు. సుమారు రూ.2.50లక్షలు వచ్చినట్టు వారు తెలిపారు.


అంతర్వేది పల్లిపాలెంలో మత్స్యకారులకు దొరికిన పండుగొప్పలు

వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి

మామిడికుదురు, జూలై 19: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం కరవాక గ్రామంలోని గంగాపురం కాలనీకి చెందిన మత్స్యకారుడు కొప్పనాతి రాంబాబు (38) వేటకు వెళ్లి శుక్రవారం మృతి చెందాడు. చేపలు పట్టేందుకు విసిరిన వల గాలికి తిరిగి మీద పడడంతో వలలోచిక్కుకుని ఉప్పుటేరులో పడి మునిగి మృతి చెందినట్టు నగరం ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.


మృతిచెందిన మత్స్యకారుడు రాంబాబు

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

గొల్లప్రోలు, జూలై 19: కాకినాడజిల్లా గొల్లప్రోలులో వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మరణించాడు. పట్టణంలోని కొత్తపేటకు చెందిన కర్రి వెంకటేశ్వరరావు(70) 18వ తేదీ మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. బయట పని ఉందని చెప్పి సాయంత్రం 6గంటలకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్‌చేస్తే స్విచ్చాఫ్ వచ్చింది. ఎక్కడ వెతికినా కనిపించలేదు. శనివారం ఉదయం వార్డు సచివాలయం-5 వద్ద గల డ్రెయిన్‌లో పడి వెంకటేశ్వరరావు చనిపోయి ఉండగా స్థానికులు గుర్తించారు. దీనిపై అతని భార్య కర్రి నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త మృతికి గల కారణాలు తెలుసుకోవాలని కోరారు. దీనిపై బీఎన్ఎస్ఎస్ యాక్ట్ 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జానీభాషా తెలిపారు.

ఒడిసా మహిళ హత్య కేసులో భర్తే నిందితుడు

సర్పవరం జంక్షన్, జూలై 19: ఒడిస్సా వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్న భర్తే హత్య చేసినట్లు నిర్ధారించి నిందితుడ్ని అరెస్టుచేసి కోర్టుకు తరలించారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్కే శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు ఒడిస్సా గంజాం జిల్లా కూలంగి గ్రామానికి చెందిన రితంజలి స్వైయిన్ (30) భర్త మీలు స్వైయిన్‌లు కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరం శివారు భావనారాయణపురంలో నివాసం ఉంటున్నారు. ఈనెల 16వ తేదీన భార్య రితంజలి స్వైయిన్‌ని హత్యచేసి కుమారుడుతో పరారయ్యాడు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. నిందితుడు మీలు స్వైయిన్ సర్పవరం ఆటోనగర్‌లో సంచరిస్తూండగా శుక్రవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. మద్యానికి వ్యసన పరుడై, శారీక కోర్కె తీర్చాలని భార్యను కోరగా తిరస్కరించడంతో కోపంతో భార్యను కొట్టి కిందపడేసి, నేలకు బుర్రను గుద్ది హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడని అన్నారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆత్యాచార నిందితుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

ఎటపాక, జూలై19: నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన అమరవరపు రాము అనే నిందితుడిని శుక్రవారం ఏఎస్పీ రాహుల్ మీనా అరెస్ట్ చేశారు. మండలంలోని ఓ గ్రామంలో నిందితుడిని అరెస్టుచేసి రంపచోడవరం కోర్టుకు రిమాండ్‌కు పంపారు. మండలంలోని ఓ గ్రామంలో ఈనెల 10న నాలుగేళ్ల చిన్నారిపై నిందితుడు అఘాయిత్యానికి పాల్పడిన విషయం విధితమే.

గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి

- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట, జూలై 19: ప్రణాళికాబద్ధంగా గ్రామాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో జిల్లాస్థాయి మాస్టర్ లెవెల్ (డీఎల్ఎంటీ) శిక్షణార్థులకు మూడు రోజుల శిక్షణా తరగతులలో భాగంగా రెండోరోజైన శుక్రవారం ప్రిన్సి పాల్ వేణుగోపాల్ హాజరయ్యారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామాలలో పేదరిక నిర్మూల నకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో పంచాయతీలు సంపద సృష్టించే కేంద్రాలుగా రూపుదిద్దుకో వాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ శిక్షణలు పొందిన డీఎల్ఎంటీలు జిల్లా స్థాయిలో గ్రామాల నుంచి ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణా తరగతులు తొమ్మిది రోజులపాటు జరుగనుండగా శ్రీకాకుళం నుంచి ఏలూరు జిల్లాల వరకూ 11 జిల్లాల నుంచి మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో చైల్డ్ ఫ్రెండ్లీ విలేజి, వాటర్ సఫిసీమెంట్ విలేజ్‌లుగా మూడు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణా తరగతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులకు ఈ శిక్షణా తరగతులకు హాజరుకాగా వివిధ అంశాలపై ఫ్యాకల్టీలు జీవీ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్‌లు వివరించారు. రెండో రోజు శిక్షణా తరగతులకు వివిధ జిల్లాలకు చెంది ఎడ్యుకేషన్, సోషల్ వెల్ఫేర్, హౌసింగ్, డ్వామా, వ్యవసాయ, పంచాయతీ రాజ్‌శాఖలకు చెందిన అధికారులను డీఎల్ఎం టీలుగా ఎంపికైన శిక్షణా తరగతులకు 70 మంది హాజరయ్యారు

నర్సింగ్‌పేటలో గిరిజనుడి అదృశ్యం

- పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

ఎటపాక, జూలై19 : ఎటపాక మండలం రాంగోపాలపురం పంచాయతీ పరిధిలో నర్సింగ్‌పేట గ్రామానికి చెందిన కొర్సా కామేశ్వరరావు అదృశ్యమైనట్లు శుక్రవారం ఎటపాక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనెల17న కామేశ్వరావువేటకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడని, మూడు రోజులు గడుస్తున్నా ఇంటికి రాలేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి రీడిప్లాయిమెంట్ ఇవ్వాలి

- నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 : నేషనల్ హెల్త్ మిషన్‌లో ఎన్‌సీడీ, సిమాంక్, ఎన్‌బీఎస్‌యూ, హెచ్‌డీఐసీయూ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వారు పనిచేసే ఆసుపత్రుల్లో ఉన్న ఖాళీల్లో, ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో ఉన్న ఖాళీల్లో వెంటనే రీడిప్లాయిమెంట్ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, మిషన్ డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను జిల్లాల అధికారులు అమలు చేయకుండా ఇబ్బందిపెడుతున్నారన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

వీవీమెరకలో గోధుమ తాచు హల్‌చల్

అంతర్వేది, జూలై 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం వీవీమెరక గ్రామం పెన్నుల కంపెనీ రోడ్డులో శుక్రవారం గోధుమ తాచుపాము హల్‌చల్ చేసింది. ఉదయం కదలకుండా ఒకేచోట ఉండడంతో జనం గోధుమతాచును చూసేందుకు ఎగబడ్డారు. ఇంత పెద్ద పామును చూసి తొలుత గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఆరు అడుగులు పొడవు ఉన్న ఈ గోధుమ తాచుకు పలువురు పూజలు చేయడం విశేషం. ఈ తాచుపామును స్నేక్ క్యాచర్ వర్మ చాకచక్యంగా పట్టుకున్నారు.



వ్యక్తిపై డ్రింక్ బాటిల్‌తో దాడి

- నిందితుడి అరెస్టు.. రిమాండ్

కడియం, జూలై 19: కడియం మండలం మాధవరాయుడుపాలెం శివారు చైతన్యనగర్ దుర్గ ఆలయం సెంటర్ వద్ద ఈనెల 18న ముంజేటి సురేష్ అలియాస్ కాళీ, అనే వ్యక్తి మద్యం తాగి ఆ బాటిల్‌ను సెంటర్‌లో రోడ్డుపై పగులగొట్టాడు. పలువురు నడిచే దారిలో పగుల గొట్టడం ఏమిటని సురేష్‌ను పలువురు వారించగా వారిని ధిక్కరిస్తూ మాట్లాడుతున్న సమయంలో వార్డుమెంబర్ బళ్ల ధనుంజయరాజు కూడా వారించే ప్రయత్నం చేశాడు. దీంతో అతనిపై సురేష్ తిరగబడి పక్కనే ఉన్న బడ్డీకొట్టులో డ్రింక్ బాటిల్‌ను పగులగొట్టి తిరగబడ్డాడు. దీంతో ధనుంజయ వీపు వెనుక, మోకాలుపై గాయాలు కాగా, కడియం సీహెచ్‌సీకి తరలించారు. బాధితుడు స్టేట్‌మెంట్ ప్రకారం సౌత్‌జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ ఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఎస్ఐ కృష్ణసాయి కేసు నమోదుచేసి సురేష్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు. కాగా సురేష్‌పై 2022లో బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసు, 2021లో రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో కొట్లాట కేసు, కడియం పోలీస్‌స్టేషన్‌లో 2022లో, 2023లో కొట్లాట కేసులు ఉన్నట్టు డీఎస్పీ తెలిపారు.

కోనసీమలో ఆటోనగర్ ఏర్పాటుకు సహకరించాలి

అమలాపురం టౌన్, జూలై 19: అమలాపురంలో ఆటోనగర్ ఏర్పాటుకు సహకరించాలని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కోరారు. శుక్రవారం సుభాష్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో చాంబర్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. అమలాపురంలో ఆటోనగర్ ఆవశ్యకతను మంత్రికి వివరించారు. చాంబర్ కార్యదర్శి యెండూరి నాగబాబు, కుప్పాల రామకృష్ణ, అడపా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

- ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం
- రోడ్లు, పల్లపు ప్రాంతాలు నీట మునక
- లంక గ్రామాల్లో పడవలపై ప్రయాణం

వర్షాలకు పంట పొలాలు మునక

ముమ్మిడివరం, జూలై 19: బంగాళాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు మండలంలో పలు లోతట్టు ప్రాంతాలు, వరి పొలాలు నీట మునిగాయి. గురు, శుక్రవారాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజాజీవనం స్తంభించింది. మండలంలో శుక్రవారం ఉదయానికి 82.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మురుగు నీటికాల్వలు, పంటకాల్వలు వర్షం నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు నీట మునిగాయి. జగనన్న కాలనీ,ముమ్మిడివరం పోలీసుస్టేషన్ ఆవరణ, తహసీల్దార్ కార్యాలయ ఆవరణ, జీఎంసీ బాలయోగి కాలనీ, బళ్లగేటు రోడ్డు ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో ప్రజాజీవనం స్తంభించింది. వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి పరిస్థితిని సమీక్షిస్తున్నట్టు తహసీల్దార్ బి.శ్రీనునాయక్ తెలిపారు. వరద ఉధృతి పెరగడంతో లంక గ్రామాల ప్రజలను అప్రమత్తంచేశారు. నాటు పడవలపై రాకపోకలు సాగించరాదని హెచ్చరికలు జారీచేశారు. వీఆర్వోలు స్థానికంగా ఉండి పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించారు.

అంబాజీపేట: వర్షాలకు మండలంలో 600ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని, ముంపునీరు బయటకు మళ్లించేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయకుమార్ సూచించారు. పుల్లేటికుర్రు, కె.పెదపూడి, మొసలపల్లి, పసుపల్లి, ఇసుకపూడి, చిరతపూడి గ్రామాల్లో నీటమునిగిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. మండలంలో 2,990ఎకరాలు వరి సాగు చేయగా ఇప్పటివరకు 1,850ఎకరాల్లో నాట్లు వేశారన్నారు. ఆరు ఎకరాల్లో నారుమడి నీట మునిగిందన్నారు. ఆయన వెంట వీఏఏ, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు. భారీ వర్షాలకు పలు రహదారులు నీటమునిగాయి. పలు కాలనీలో వర్షం నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గంగలకుర్రు అగ్రహారం మట్టపర్తివారిపాలానికి చెందిన దొమ్మేటి సూర్యకాంతం తాటాకిల్లు వర్షానికి నానిపోయి కూలిపోయింది.

అలమూరు: భారీ వర్షాలకు మండలంలో అనేక ప్రాంతాలలో వరినాట్లు ముంపునకు గురయ్యాయి. వర్షాలకు నాట్లు వేసిన పంట భూముల్లోకి వర్షం నీరు చేరింది. దీంతో నాట్లు పూర్తిగా మునిగితేలుతున్నాయి. చింతలూరు, పినపళ్ల, పెదపళ్ల, సంధిపూడి, గుమ్మిలేరు, మోదుకూరు, ఆలమూరు, చొప్పెల్ల, నవాబుపేట గ్రామాల్లో వరినాట్లుకు భారీ నష్టం కలిగినట్లు అంచనా వేస్తున్నారు. వరి నారుమడులు నీట మునిగిపోవడంతో వర్షాలు తగ్గిన తరువాత కూడా నాట్లు వేయడానికి పనికి రాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పినపళ్లలో ముంపునకు గురైన వరినాట్లను జనసేన పార్టీ కొత్తపేట ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ అధ్వర్యంలో జనసేన బృందం పరిశీలించింది.




ఆత్రేయపురం: కట్టుంగలో నీట మునిగిన వరి పొలాలు, కపిలేశ్వరపురం: వెదురుమూడిలో నీట మునిగిన వరిచేలు

ఆత్రేయపురం: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ మూసుకుపోవడంతో నివాస ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలిచిపోయింది. వరినాట్లు, ఆకుమడులు, కూరగాయల పంటలు నీటమునిగాయి. రోడ్డు పక్కన వృక్షాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు పలు చోట్ల అంతరాయం ఏర్పడింది.

మామిడికుదురు: పాశర్లపూడిలోని సత్రంతోట కాలనీ వర్షం నీటితో నిండా మునిగి తేలుతుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీల్లోని ఇళ్ల చుట్టూ వర్షం నీరు చేరడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అయినవిల్లి: వర్షాలకు మండలంలో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. నాట్లు వేసిన నారుమడులు, పొలాలు నీట మునిగాయి. వర్షాలకు పంటకాల్వలు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు, కాలనీలకు డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ముంపు బారిన పడ్డాయి.

రాయవరం: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని 12గ్రామాల్లో 13,113 ఎకరాల్లో వెదసాగు, వరినాట్లు వేశారు. లొల్లలో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ పొలాలను పరిశీలించారు. ఊడ్చిన పొలంలో పిలక దశలో ముంపునకు గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. నారుమళ్లు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. లొల్ల సర్పంచ్ చాత్రాతి జానకి రాంబాబు, గ్రామ వ్యవసాయ సహాయకుడు తేజ, రైతులు పాల్గొన్నారు.

రావులపాలెం: రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు నాట్లు వేసిన పంటపొలాలు సైతం ముంపునీటిలో చిక్కుకున్నాయి. రావులపాలెం మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు నాట్లు వేసిన పంటపొలాలు, నారుమడులు వర్షం ముంపులో తేలాడుతున్నాయి. మురుగు డ్రెయిన్లు పొంగి ప్రవహించడంతో మురుగుదిగే దారే కనిపించడం లేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నాట్లు వేయగా మరికొన్ని గ్రామాల్లో పంట పొలాల్లో నారుమడులు నాట్లు దశకు చేరుకున్నాయి. ఒక పక్క వర్షం ముంపు వల్ల నారుమడులు దెబ్బతినే పరిస్థితి ఉండగా మరొపక్క క్యాట్‌ఫిష్‌ల బెడద ఎక్కువై నారుమడులను ధ్వంసం చేస్తున్నాయి. రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలోకి భారీగా వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తహసీల్దారు కార్యాలయం రోడ్డుతో పాటు పలు రహదారుల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామాల్లోని రహదారులు ఛిద్రమై గోతుల్లోకి వర్షం నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

రాజోలు: భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. తాటిపాక కొత్తకాలనీ, రాజోలు పల్లపు ప్రాంతాలు, వేగివారిపాలెం కొత్తకాలనీ వర్షం నీటితో నీట మునిగాయి. ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కె.గంగవరం: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మండలంలో గురువారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు మునిగిపోయాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగి పోయాయి. ముఖ్యంగా నాట్లు వేసిన వరి పొలాల్లో నీరు నిలిచిపోయింది. మరో రెండు రోజులు ఈవిధంగా పొలాల్లో నీరు నిలిచిపోతే నాట్లు కుళ్లిపోతాయిన రైతులు ఆందోళన చెందుతున్నారు. నాట్లు వేయాల్సిన రైతులు మరో ఐదు రోజులు నాట్లు వేయడాన్ని వాయిదా వేసుకోవాలని వ్యవసాయశాఖ ఏవో బులుసు రవి రైతులకువిజ్ఞప్తి చేశారు.

మండపేట: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండపేట పరిసర ప్రాంతాల్లో వరి పొలాలు ముంపునకు గురై చెరువులను తలపిస్తున్నాయి. మండపేట-ఆలమూరు రోడ్డులో ఉన్న పంట పొలాలు నీట మునిగి చెరువు లను తలపిస్తున్నాయి. మండపేట గొల్లపుంతకాలనీలో పొలాలు నీట మునిగాయి, అర్తమూరు, తాపేశ్వరం, ఇప్పనపాడు, ద్వారపూడి, పాలతోడు వెలగతోడు తదితర గ్రామాల్లో వరి పొలాలు జలమయమయ్యాయి. మండలంలో ఉన్న మురుగుకాల్వలు, గొడ్డుకాల్వ తుల్యాభాగ డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. గుర్రపు డెక్క మురుగుకాల్వలో పేరుకుపోవటంతో మురుగునీరు పారే పరిస్థితి కనిపించడం లేదు. ద్వారపూడిలోని మొసళ్లచెరువు నిండి పొర్లుతుంది. పంగిడిచెరువు నుంచి నీరు దిగుతుండటంతో గ్రామంలో రహదారులు ముంపునకు గురయ్యాయి.గ్రామంలో భారీవర్షంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పంచాయతీ కార్యదర్శి ఆకుల వెంకటరమణ నేతృత్వంలో ఎక్స్‌కవేటర్‌తో మురుగుకాల్వలు, డ్రైన్లు శుభ్రం చేశారు. కేశవరంలో ఉన్న పోతురాజు చెరువు పొంగి ప్రవహిస్తోంది. కేశవరం కాజ్‌వేపై నీరు పారుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పి.గన్నవరం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు ప్రాంతాల్లో వరిచేలు, పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. పి.గన్నవరం ప్రధాన రహదారి చెంతన ఉన్న వరిచేలు, పంచాయతీరోడ్డులోని వరిచేలు, నారుమడులు నీటమునిగాయి. డ్రైను అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షం నీరు దిగే పరిస్థితులు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని డ్రైనేజీ వ్యవస్థలేని కాలనీలు, లోతట్టు ప్రాంతాలు వర్షం నీటితో అధ్వానంగా మారాయి. పి.గన్నవరం-అంబాజీపేట రహదారి దయనీయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

కపిలేశ్వరపురం: భారీవర్షాలు, ఈదురుగాలులకు మండలంలోని పలు ప్రాంతాల్లో పంటపొలాలు నీటమునిగాయి. పలుచోట్ల చెట్లు విరిగి పడ్డాయి. పల్లపు ప్రాంతాలకు నీరు చేరి రోడ్లు జలమయమ య్యాయి. పలు రహదారులు గోతులుపడి ఛిద్రంగా మారడంతో ఇటుకబట్టీలు చుట్టూ నీరు చేరడంతో బట్టీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాచర నుంచి కోరుమిల్లి వెళ్లే రహదారిలో చర్చి వద్ద భారీ వృక్షం విరిగి రోడ్డుపై పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు ఎక్స్‌కవేటర్‌తో వృక్షాన్ని తొలగించారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో నదీ పరివాహక ప్రాంతాలు కోరుమిల్లి, కపిలేశ్వరపురం, తాతపూడి, కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఉప్పలగుప్తం: వర్షాలకు సార్వానాట్లు వేసిన పొలాలు, నారుమళ్ళు జలాశయాలుగా మారాయి. ఉప్పలగుప్తం, పేరాయిచెరువు, మునిపల్లి, వానపల్లిపాలెం, గొల్లవిల్లి, వాడపర్రు, కూనవరం, సన్నవిల్లి, నంగవరం, భట్నుపాలెం తదితర గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు, తహసీల్దార్ మల్లికార్జునరావు నీట మునిగిన పొలాలను శుక్రవారం పరిశీలించారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సన్నవిల్లి-ఉప్పూడి మెయిన్ రహదారి గోతులు నీటితో మునిగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నీట మునిగిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

ఆత్రేయపురం, జూన్ 19: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం లొల్ల గ్రామంలో ముంపు బారిన పడిన పంట పొలాలను పరిశీలించారు. వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులకు సహాయక చర్యలు అందించాలని ఆయన ఆదేశించారు. పంటకాల్వలు, బోదెల్లో గుర్రపు డెక్కను తొలగించి ముంపునీరు బయటికి వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం రైతులకు అన్ని చర్యలు చేపడుతుందని సూచించారు. ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పేకాటక్లబ్ నిర్వహణ ఆపాలని సుప్రీం కోర్టు తీర్పు

యానాం, జూలై19: యానాంలోరిక్రియేషన్ పేరుతోనడుస్తున్న పేకాట క్లబ్ నిర్వహణ ఆపాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని పరిపాలనాధికారి మునిస్వామి తెలిపారు. గతంలో యానాంలోని రాయల్ క్లబ్ నిర్వహణకు మద్రాస్ హైకోర్టు నుంచి ఉత్తర్వులు పొంది క్లబ్ కొనసాగిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం క్లబ్ నిర్వహణపై వివిధ కారణాలతో అభ్యతరం చెప్పడంతో మూసివేశారు. దీంతో క్లబ్ నిర్వాహకులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం కూడా హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వాదనలు వినిపించింది. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చిందని తెలిసింది. దీనిపై ఆర్ఏ మునిస్వామిని వివరణ కోరగా సుప్రీంకోర్టు స్టే ఇచ్చినటు సమాచారం వచ్చిందని, స్టే ఆర్డర్ ఉత్తర్వులు వచ్చిన తర్వాత వివరాలు వెల్లడిస్తామన్నారు.

టీడీపీ, జనసేన గెలుపు ప్రజా విజయం

అల్లవరం, జూలై 19: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపు ప్రజావిజయమని, నియోజకవర్గ అభివృద్ధే ఆశయమని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. కోడూరుపాడు లోని కల్యాణ మండపంలో టీడీపీ నాయకుడు గుబ్బల రాంప్రసాద్ అధ్యక్షతన టీడీపీ కూటమి విజయోత్సవ సభ జరిగింది. గుబ్బల రాంప్రసాద్ దంపతులు ఎమ్మెల్యే ఆనందరావును, టీడీపీ ముఖ్య నేతలను సన్మానించారు. పెచ్చెట్టి చంద్రమౌళి, పెచ్చెట్టి విజయలక్ష్మి, దెందుకూరి సత్తిబాబురాజు, యాళ్ళ బ్రహ్మానందం, వేగిరాజు వెంకట్రాజు, కేవీ, పోతుల నాగరాజు, సుంకర సాయి, దాట్ల గోపిరాజు, గుత్తుల నాగేశ్వరరావు, గుబ్బల నాగేశ్వరరావు, పిల్లా ప్రసాద్, గెద్దాడ శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంతో తీరిన ప్రజల సమస్యలు

మామిడికుదురు, జూలై 19: పాశర్లపూడిలంక-లూటుకుర్రు మధ్య వాడబోధి డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన నిర్మాణంతో నాలుగు గ్రామాల ప్రజల కష్టాలు తీరాయని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. డ్రెయిన్‌పై అప్పటి కలెక్టర్ హిమాన్షు శుక్లా చొరవతో 101.60లక్షలతో ఈనిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీ నిధుల నుంచి రూ.25లక్షలు, జడ్పీపీ నుంచి రూ.35లక్షలు, డీఎంఎఫ్ నిధులు రూ.41.60లక్షలతో ఈనిర్మాణాన్ని చేపట్టారు. పాశర్లపూడిలంక పంచాయతీ ఈవారధికి హిమాన్షు శుక్లా రామసేతు వారధిగా నామకరణం చేస్తూ తీర్మానం చేశారు. ఈవంతెనను శుక్రవారం ఎమ్మెల్యే గిడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, హిమాన్షు శుక్లా తండ్రి మున్నాలాల్‌శుక్లా, జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజాకుమారి, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, సుందరనీడి రాజేష్‌కుమార్, జాలెం రమణకుమారి, గుబ్బల దుర్గ, కొనుకు ప్రేమజ్యోతి, టీడీపీమండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, నాయకులు బోనం బాబు, మద్దాల కృష్ణమూర్తి, ఎంపీటీసీలు నామన వెంకటేశ్వరరావు, చెరుకూరి పార్వతీదేవి, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మామిడికుదురు, జూలై 19: జాతీయ రహదారిపై పాశర్లపూడి-కైకాలపేట వద్ద ఏర్పడిన గోతులు పూడ్చడానికి జాతీయ రహదారి అధికారులు ఎట్టకేలకు స్పందించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుపై పడిన గోతులను పూడ్చడానికి పనులు మొదలు పెట్టారు. వర్షంలో సిబ్బంది రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు.

వైనతేయ రేవుల్లో రాకపోకలు బంద్

అల్లవరం, జూలై 19: ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాలకు వైనతేయ గోదావరికి వరద నీరు పోటెత్తడంతో రేవుల్లో పడవలపై రాకపోకలను శుక్రవారం నుంచి నిలిపివేశారు. అల్లవరం మండలంలో ఓడలరేవు- కరవాక, బెండమూర్లంక- గోగున్నమఠం రేవుల్లో జిల్లా అధికారుల ఆదేశాలతో పడవలపై ప్రయాణం బంద్ చేస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణమోహన్ తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలి

విద్యుత్ సమస్యలపై వాడీవేడిగా చర్చ

అమలాపురం రూరల్, జూలై 19: పంట కాల్వల వెంబడి ఆక్రమణలు పెరిగిపోతున్నాయని వాటిని తొలగించాలని ఈదరపల్లి ఎంపీటీసీ సభ్యుడు అడపా సత్తిబాబు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉత్పన్నమైనప్పుడు సిబ్బంది సక్రమంగా స్పందించడం లేదని తాండవపల్లి సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు, ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమలాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఆక్రమణలు, విద్యుత్ సమస్యలపై వాడీవేడి చర్చ జరిగింది. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను సత్వరం పూర్తిచేసి ఇంటింటికీ తాగునీరు అందించాలని సర్పంచ్ చెల్లుబోయిన నాని కోరారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ ఓహెచ్‌ఎస్సార్ ట్యాంకుల నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రజలకు తాగునీరు అందించని పరిస్థితి ఏర్పడిందన్నారు. గృహనిర్మాణశాఖ అధికారుల తీరు కారణంగానే ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఓడిపోయిందని సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు ఆరోపించారు. గృహనిర్మాణాలకు వ్యక్తిగత రుణాలు అందించడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు అధికారుల తీరులో మార్పు రావడంలేదని ఎంపీపీ భాగ్యలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని సచివాలయాలు, రైతుభరోసాకేంద్రాలు, హెల్త్‌క్లినిక్ భవననిర్మాణపనులు పూర్తికాకుండానే అప్పట్లో మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించారని, ఆ పనులు ఎప్పట్లోగా పూర్తి చేస్తారని సర్పంచ్ పెనుమాల సునీత ప్రశ్నించారు. మధ్యలోనే నిలిచిపోయిన అంగన్‌వాడీ భవననిర్మాణాలకు, పాడైపోయిన ఐసీడీఎస్ ప్రాజెక్టు భవనం మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని సీడీపీవో కె.విజయకుమారి ఎంపీపీని కోరారు. పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఎంపీడీవో జి.మల్లికార్జునరావు, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, జడ్పీటీసీ పందిరి శ్రీహరి పాల్గొన్నారు.

తిరుమలకు అల్లూరి పాదయాత్ర

కపిలేశ్వరపురం, జూలై 19: అధికారంలోకి కూటమి ప్రభుత్వం రావాలని, ఎమ్మెల్యేగా వేగుళ్ల జోగేశ్వరరావు విజయం సాధిస్తే తిరుమలకు పాదయాత్రగా వస్తానని వెంకటేశ్వరస్వామికి వాకతిప్పకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు అల్లూరి రామకృష్ణచౌదరి మొక్కుకున్నారు. శుక్రవారం అల్లూరి చేపట్టిన యాత్రను ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రారంభించారు. ఈయాత్ర 18రోజులు సాగుతుందన్నారు.

పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

అమలాపురం టౌన్, జూలై 19: పట్టణాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సూచించారు. ప్రజలను, ప్రజాప్రతినిధులను మభ్య పెట్టేలా వ్యవహరించవద్దని అధికారులకు సూచించారు. 2004 మాస్టర్ ప్లాన్ అమలు తీరుపై కౌన్సిలర్లు బొర్రా చిట్టిబాబు, మట్టపర్తి నాగేంద్రలు ప్రశ్నల వర్షం కురిపించారు. ఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం టౌన్ ప్లానింగ్ అధికారులు భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారో చెప్పాలన్నారు. అమలాపురం పురపాలక సంఘ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన మాస్టర్ ప్లాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. 2002లో మాస్టర్ ప్లాన్ అమలు గురించి వివరించినా ఇంతవరకు వాటికి సంబంధించిన వివరాలు కౌన్సిలర్లకు అందజేయలేదని కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి ప్రశ్నించారు. పట్టణంలో ఉన్న రోడ్ల పరిస్థితితో సహా అన్ని వివరాలు తెలిసినప్పటికీ అభ్యంతరాలు చెప్పినా అప్పట్లో పట్టించుకోలేదని కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ పేర్కొన్నారు. అప్పట్లో ఎవరిచేత మాస్టర్ ప్లాన్ చేయించారో అందుకు ఎంత మొత్తం ఖర్చు చేశారో తెలియచేయాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ప్రశ్నించారు. లియో అసోసియేట్ సంస్థను ప్రభుత్వమే నియమించిందని అప్పట్లో అయిన ఖర్చును ప్రభుత్వమే భరించినట్టు కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. ప్రస్తుతం అముడా ఆధ్వర్యంలోనే ప్లాన్ అప్రూవల్స్ అమలు జరుగుతున్నాయని తెలిపారు. అమలాపురం కలెక్టరేట్ నుంచి ముమ్మిడివరం గేట్ సెంటర్ వరకు కేఎన్‌ఎఫ్ రోడ్డును 80 అడుగులు వెడల్పు చేసేందుకు మాస్టర్ ప్లాన్ సూచించినట్టు వివరించగా 60అడుగులు సరిపోతుంది కదా అని ఎమ్మెల్యే ఆనందరావు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లు, డివైడర్ల ఏర్పాటు వంటి వాటి కోసం రూ.70కోట్లతో అంచనాలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. వీటితో పాటు ఈదరపల్లి, ఇందుపల్లి తదితర ఏడు వంతెనల నిర్మాణాలకు రూ.15కోట్లతో అంచనాలు వేస్తున్నట్టు ఆనందరావు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు యేడిద శ్రీను, ఆశెట్టి నాగదుర్గ, గండి దేవిహారిక, పిండి అమరావతి తదితరులు అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే వేగుళ్ల



మండపేట, జూలై 19: కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాకప్పి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

మండపేట, జూలై 19: ఆలమూరు తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ది ఆలమూరు తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా కొనగళ్ళ సత్యనారాయణ, అధ్యక్షుడిగా ముత్యాల సత్యనారాయణ(చంటిబాబు), కార్యదర్శిగా ఎస్.వి.వి.సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా పేపర్తి వీరభద్రరావు, కోశాధికారిగా వెచ్చ సూర్యకోటి ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శిగా వల్లూరు సత్యనారాయణ చౌదరి ఎన్నికయ్యారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

కొత్తపేట, జూలై 19: వర్షాకాలం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం, రక్షిత తాగునీరు తదితర విషయాలపై అధికారులు దృష్టిసారించి అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మార్గన గంగాధర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్, డ్రైనేజీ, ఇరిగేషన్, హెడ్‌వర్క్స్, వ్యవసాయ శాఖ, పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో శానిటేషన్ డ్రైవ్‌లు చేపట్టాలని, ఎడతెరిపిలేని వర్షాల కారణంగా వరి చేలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తపేట సబ్‌డివిజన్ కావడంతో అన్ని కార్యాలయాల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని, ప్రాధాన్యత క్రమంలో అధికారుల భాగస్వామ్యంతో ముందుకు వెళ్తామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ గుడపాటి రమాదేవి, డీఎల్‌డీవో రాజేశ్వరరావు, వైస్‌ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, తహసీల్దారు జి.ఏలిషా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అధికారుల వైఖరి, సమస్యలపై సర్పంచ్‌ల ఆగ్రహం

అల్లవరం, జూలై 19: ఇళ్ల నిర్మాణంలో జాప్యం, రోడ్ల అధ్వానస్థితి, డ్రెయిన్‌లో వలకట్లు, సర్పంచ్‌ల పట్ల అధికారి వైఖరిపై సర్పంచ్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో అల్లవరం మండల పరిషత్ సమావేశం వాడివేడిగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా అసంపూర్తిగా ఉన్న సమస్యలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండిపడ్డారు. కొమరగిరిపట్నంలో పింఛన్ల పంపిణీపై వచ్చిన ఫిర్యాదులపై విచారణకు వచ్చిన ఎంపీడీవో కృష్ణమోహన్ అక్కడే ఉన్న సర్పంచ్ రాకాపు విజయలక్ష్మిని పిలవకపోవడం పద్ధతి కాదంటూ ఎంపీపీ శేషగిరిరావు, సర్పంచ్‌లు సాధనాల వెంకట్రావు, దాకారాపు చిరంజీవి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు ఆరోపించారు. రామేశ్వరంమొగను ఆటోమేటిక్ లాక్‌సిస్టమ్ ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీపీ కోరారు. డ్రెయిన్లలో వలకట్లను తొలగించాలని సభ్యులు కోరగా వలకట్లను తొలగించేందుకు చర్యలు చేపట్టామని డ్రెయిన్ ఏఈ సునీత వివరించారు. గృహనిర్మాణాల బిల్లులు మంజూరు చేయాలని ఎంపీటీసీ మౌనిక కోరారు. గూడాల, దేవగుప్తం రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయంటూ సభ్యులు ధ్వజమెత్తారు. విద్యుత్ తదితర సమస్యలపై సభ్యులు ప్రశ్నించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, జడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్‌ఎంపీపీ ముత్యాల రామకృష్ణ, వడ్డి గంగ, ఎంపీడీవో కృష్ణమోహన్, తహసీల్దారు పి.సునీల్‌కుమార్, జేఈలు జి.సంపత్, జి.స్వామి, డి.శ్రీనివాసరావు, రమేష్, ఏపీఎం సయ్యద్, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

పి.గన్నవరం, జూలై 19: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల్లో పేరుకుపోయిన ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. మండలపరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. ముఖ్య శాఖల అధికారులు అందుబాటులో ఉండటం లేదని, ఫోన్లకు సైతం స్పందించడంలేదని నాదృష్టికి వచ్చిందని, తీరు మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటారని ఎమ్మెల్యే హెచ్చరించారు. ముఖ్య శాఖలకు సంబంధించి పెండింగ్ బిల్లులు, పనులను పరిశీలిస్తున్నామని, వాటిని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని, సంబంధిత మంత్రులకు సమస్యలు వివరిస్తానన్నారు. అనంతరం జరిగిన శాఖలవారీ రివ్యూలో 2022లో వరదల్లో ధ్వంసమైన ఇళ్లకు హౌసింగ్ ద్వారా రుణాలు ఇప్పిస్తామని ఇప్పటి వరకు మంజూరు చేయలేదని లంకలగన్నవరం సర్పంచ్ పసలపూడి అన్నారు. రుణాలు మంజూరు ఇంకా కాలేదని డీఈ డి.రామకృష్ణ బదులిచ్చారు. విద్యుత్ కోతల సమయంలో తాగునీరుకు ఇబ్బందులు పడుతున్నామని జనరేటర్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ రామకృష్ణ కోరారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ చక్రవర్తి బదులిచ్చారు. విద్యుత్ కోతలతో పాటు లోహోల్టేజ్ సమస్య, అదనపు విద్యుత్‌స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల కొరత మండల వ్యాప్తంగా ఉందని సర్పంచ్‌లు పత్తిపాటి ఉమామహేశ్వరి, బొండాడ నాగమణి, ఎంపీటీసీలు సత్తిబాబు, దామోదరం, సాయిబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై తక్షణమే స్పందించాలని, పరిష్కారం కాకపోతే నాదృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, తహశీల్దార్ ఎస్‌కే హుస్సేన్, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వివరాలు నాయకులకు తెలపాలి

కె.గంగవరం, జూలై 19: గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల వివరాలు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసి వారిని బాగస్వాములను చేయాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. శుక్రవారం కె.గంగవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా బోస్ ప్రసంగించారు. ఎంపీపీ నాగమణి శాఖలవారీగా సమీక్ష చేశారు. ఈసందర్భంగా బోస్ అధికారులకు పలు సూచనలు చేశారు. లిక్విడ్ యూరియా గురించి రైతులకు వివరించాలని వ్యవసాయ శాఖ అధికారులకు, మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఎంఈవో తనిఖీలు చేసి క్వాలిఫైడ్ టీచర్లు లేకపోతే చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. జడ్పీటీసీ ఓలిశెట్టి శ్రీవరలక్ష్మి, వైస్‌ఎంపీపీలు దూడల నాగేశ్వరరావు, నీతిపూడి మధుబాల, ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వ్యవసాయశాఖ అధికారి బులుసు రవి, ఎంఈవో ఏ. నాగరాజు, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో గణపతి పాల్గొన్నారు.

ఏయూ పరీక్ష తేదీలు మార్చాలి: ఎమ్మెల్సీ ఐవీ

అమలాపురం టౌన్, జూలై 19: ఏపీపీఎస్సీ నిర్వహించే ఈవో అండ్ జీవో పరీక్షలు ఈనెల30,31తేదీల్లో జరుగుతున్నందున ఆంధ్రా యూనివర్శిటీ పీజీ ప్రొఫెషనల్, డిప్లమో కోర్సు పరీక్ష తేదీలు మార్చాలని ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) కోరారు. ఆంధ్రా యూనివర్శిటీ ఇచ్చిన షెడ్యూల్‌లో ఈనెల30,31 తేదీల్లో పరీక్షలు ఉన్నాయన్నారు. అయితే అదే రోజుల్లో ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షలను ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉన్నందున పరీక్ష తేదీలు మార్పు చేయాలని పీడీఎఫ్ తరఫున విజ్ఞప్తి చేశారు. వైస్ చాన్స్‌లర్ రాజీనామా కారణంగా ఇంత వరకు ఏనిర్ణయం తీసుకోలేదన్నారు. కొత్తగా ఆంధ్రా యూనివర్శిటీ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు తీసుకున్న శశిభూషణ్‌రావుతో శుక్రవారం ఐవీ ఫోన్‌లో ఈవిషయాన్ని వివరించారు. పరీక్ష తేదీల మార్పుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వీసీ హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్సీ తెలిపారు.

సీతపల్లి అమ్మవారికి మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు



మొక్కు తీర్చుకోవడానికి సీతపల్లి వెళ్లిన టీడీపీ నాయకులు

ఆలమూరు, జూలై 19: కొత్తపేట ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావు గెలుపొందాలని సీతపల్లి బాపనమ్మ తల్లికి పినపళ్లకు చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు మొక్కుకున్నారు. ఎమ్మెల్యేగా సత్యానందరావు గెలుపొందడంతో శుక్రవారం లక్ష్మణరావు అధ్వర్యంలో సీతపల్లికి టీడీపీ నాయకులు తరలివెళ్లి అమ్మవార్ని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. నాయకులు మెర్ల గోపాలస్వామి, ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, ఈదల నల్లబాబు, నాగిరెడ్డి వెంకటరత్నం, వంటిపల్లి సతీష్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి విఘాతం కలగకుండా మెలగాలి

రావులపాలెం, జూన్ 19: మత సామరస్యానికి విఘాతం కలగకుండా అందరి మనోభావాలను గౌరవించే విధంగా మెలగాలని కొత్తపేట నియోజకవర్గ నాలుగు మండలాల్లో ఉన్న క్రైస్తవులకు జేఏసీ సభ్యులు పిలుపునిచ్చారు. రావులపాలెం లిటిల్ ఫ్లాక్ లూథరన్ చర్చిలో జేఏసీ చైర్మన్ కప్పల వరప్రసాద్(సీఆర్) ఆధ్వర్యంలో ఎన్.డేవిడ్‌రాజు అధ్యక్షతన కొత్తపేట నియోజకవర్గ నాలుగు మండలాల క్రైస్తవ మత పెద్దలు, యూనిస్ ఫెలోషిప్ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో శనివారం ఊబలంక రోడ్డులో పాస్టర్ సత్య ఆధ్వర్యంలో క్రైస్తవ సువార్త ప్రకటించారు. ఈసందర్భంలో హిందూ మత సామరస్యం దెబ్బతిన్న కారణంగా సత్యను వివరణ కోరగా రెండో శనివారం సందర్భంగా సెలవును పురస్కరించుకుని సువార్త ఏర్పాటు చేశామే తప్ప ఉద్దేశ్యపూర్వకంగా చేసినది కాదని జేఏసీ నాయకులకు, క్రైస్తవ సంఘ నాయకులకు ఏవిధమైన సంబంధం లేదని తెలిపారన్నారు. తెలియక జరిగిందని, ఇక ముందెన్నడూ హిందూ మత సాంప్రదాయాలకు ఏవిధమైన ఆటంకాలు లగకుండా జాగ్రత్తగా ఉంటామని తెలిపారన్నారు. అనంతరం జేఏసీ నాయకులు మట్లాడుతూ హిందూ మత మనోభావాలు దెబ్బతినే విధంగా జరిగిన సంఘటనను జేఏసీ ఖండిస్తుందన్నారు. మత సామరస్యానికి విఘాతం కలగకుండా అందరి మనోభావాలు గౌరవించే విధంగా మెలగాలన్నారు. 4మండలాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.1.25లక్షల విరాళం

ఆత్రేయపురం, జూలై19: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి అన్నదాన భవన నిర్మాణానికి బిక్కవోలు మండలం కొమరపాలానికి చెందిన కొవ్వూరి రాజశేఖరరెడ్డి-వినోద దంపతులు రూ.లక్ష, రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన కర్రిశ్రీనివాసరెడ్డి-వెంకటలక్ష్మి దంపతులురూ.25వేలువిరాళం ఇచ్చారు.

కారు పార్కింగ్ వేరేచోట ఏర్పాటుచేసుకోవాలి

ఆత్రేయపురం, జూన్ 19: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులు సొంత వాహనాలతో ఆలయానికి రావడానికి వచ్చే దారులు వర్షాలకు పాడైపోయినట్టు ఉపకమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. ఏటిగట్టు ప్రాంగణంలో పార్కింగ్ ప్రాంతం బురదమయం కావడం, ఆలయంవద్ద ఏర్పాటుచేసిన మరోపార్కింగ్ వర్షంనీటితో నిండుకుందని తద్వారా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు పార్కింగ్ ఖాళీగా ఉన్నచోట్ల ఏర్పాటుచేసుకోవాలన్నారు. వాడపల్లి ముఖద్వారంవద్ద 12ఉచితఆటోలు భక్తులకోసం రాకపోకలకు ఏర్పాటు చేశామన్నారు.

తపాలా ఉద్యోగుల ధర్నా

మండపేట, జూలై 19: తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, 8వ వేతన సంఘం ఒప్పందం అమలు చేయాలని కోరుతూ శుక్రవారం మండపేటలో తపాలా ఉద్యోగులు శుక్రవారం భోజనవిరామ సమయంలో స్థానిక తపాలా కార్యాలయంవద్ద ధర్నా చేశారు. ఉద్యోగ సంఘ నాయకులు ఈశ్వరరావు, శివయ్య, సూర్యనారాయణ, వెంకట్రావు, ప్రసాద్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

రాజోలు, జూలై 19: ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను విద్యార్థులు శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంపీపీ కేతా శ్రీను అన్నారు. శుక్రవారం కూనవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. వైస్ ఎంపీపీ ఇంటిపల్లి ఆనందరాజు, సర్పంచ్ బోనం అచ్యుతానంద్, ఎంపీటీసీ కుడుపూడి గణేశ్వరరావు, బోనం నారాయణరావుపాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి

మామిడికుదురు, జూలై19: కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. లూటుకుర్రు హైస్కూలులో స్టూడెంట్ కిట్లను ఎమ్మెల్యే శుక్రవారం పంపిణీ చేశారు. మామిడికుదురు హైస్కూలులో ఎంపీపీ కె.వనజాకుమారి. జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ అడబాల తాతకాపు, డీఈవో ఎం.కమలకుమారి, సర్వశిక్షాప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు పాల్గొన్నారు.